క్లుప్తంగా

జడ్జి దీపా దైవకృపకు పదోన్నతి



ఆలమూరు: ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న దీపా దైవకృపకు సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి లభించింది. ఆమె పెద్దాపురం కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టనున్నారు. జడ్జి దీప దైవకృప ఈ ఏడాది మహిళల సమస్యలపై డాక్యుమెంట్ రూపొందించి ఆంధ్ర యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ పొందారు.

నేడు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పర్యటన

ఆలమూరు: చింతలూరు, చొప్పెల్ల గ్రామాల్లో గురువారం కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు చింతలూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చొప్పెల్లలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తారని చెప్పారు.

ఘనంగా కలశ పూజ

అంబాజీపేట : గంగలకుర్రు అగ్రహారంలోని అరిగెలవారిపాలెంలో అరిగెల మధు ఇంటి వద్ద అయ్యప్పస్వామి 18 కలశల పూజ బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీలక్ష్మీగణపతి హోమం చేశారు. మద్దింశెట్టి ఆదిబాబు గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు కలశలతో గ్రామంలో మేళతాళాలతో ఊరేగారు. అనంతరం గోవిందవఝుల దుర్గానాగేంద్ర భాస్కరశర్మ మంత్రోచ్ఛరణతో కలశ పూజ వైభవోపేతంగా నిర్వహించారు.

శబరిమల యాత్రకు స్వాముల పయనం

మామిడికుదురు: అయ్యప్ప దీక్షను 40 రోజులు పూర్తిచేసుకున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన స్వాములు బుధవారం ఇరుముడులు కట్టించుకుని శబరిమల యాత్రకు పయనయ్యారు. అప్పనపల్లి, మగటపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో సుమారు 30 మంది స్వాములకు పెదపట్నానికి చెందిన జయంతి సుబ్బారావు, మామిడికుదురుకు చెందిన వర్థినేని సత్యశ్రీనివాస్ గురుస్వాములు ఇరుముడులు కట్టారు.

వైభవంగా లక్ష తులసి పూజ



సత్యనారాయణ స్వామి

మామిడికుదురు: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పాశర్లపూడిబాడవలో ఉన్న వీర వెంకట సత్యనారాయణ స్వామివారికి బుధవారం లక్ష తులసిపూజ వైభవంగా జరిపించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శ్రీకాంత్ నేతృత్వంలో నిమ్మల అప్పారావు దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొన్నారు.

మోరి శివాలయంలో లక్షపత్రి పూజ

సఖినేటిపల్లి: మోరిలోని పార్వతీ సీతారామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం భక్తులు ఘనంగా లక్షపత్రి పూజ నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమ పూజ చేశారు. ఆలయ ఛైర్మన్ జాన వీరభద్రప్రసాద్, సమీరకుమారితో పాటు 101 మంది దంపతులు ఈ విశేష పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత ఆలయ అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య, రుద్రాభిషేకం నిర్వహించారు.

ప్రతాప్‌కు అభినందనలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని మహత్యంపై తొమ్మిది బుధవారాలు, స్వామి వరాలు ప్రచారంపై ప్రత్యేక ఆధ్యాత్మిక గీతం రాసిన కవి, శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్‌ను ఉపముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం అభినందించారు. తాడేపల్లిగూడెంలో మంత్రి సత్యనారాయణను ప్రతాప్ కలిసి, ఆధ్యాత్మిక గీతం బ్రోచర్‌ను అందజేశారు. ఈ గీతాన్ని అంతర్వేదిలో ఆలయ ఏసీ వి.సత్యనారాయణ ఇటీవల విడుదల చేశారు. సంగీతాన్ని స్వరపరిచిన సింధు కె.ప్రసాద్‌ను మంత్రి ప్రశంసించారు.

డీవీఈఓ ఆకస్మిక తనిఖీ

అయినవిల్లి: ముక్తేశ్వరం ఎస్ఎస్‌వీఆర్ కళాశాలను డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులను ఆయన పరీక్షించారు. ఫైనల్ పరీక్షల్లో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కళాశాల ఉత్తీర్ణత శాతాన్ని, కళాశాల సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులపై శ్రద్ధ వహించాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.శ్యామ్ ఎబెల్ ఉన్నారు.

మాజీ ఉప సర్పంచ్ రాముడు కన్నుమూత



శ్రీరామమూర్తి (ఫైల్‌ఫొటో)

మామిడికుదురు: పెదపట్నం మాజీ ఉప సర్పంచ్ గంధం శ్రీరామమూర్తి (రాముడు, 80) మంగళవారం రాత్రి మరణించారు. ఉప సర్పంచ్‌గా ఆయన గ్రామానికి పదేళ్లు సేవ చేశారు. గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ఏటా గ్రామంలో జరిగే సప్తాహ మహోత్సవంలో కీలకంగా వ్యవహరించే వారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ, సీనియర్ నేతగా గుర్తింపు పొందారు. ఆయన మృతికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, నగరం ఏఎంసీ మాజీ ఛైర్మన్ జక్కంపూడి తాతాజీతో పాటు పలువురు పార్టీ నేతలు సంతాపం తెలిపారు.

సీఎంగా జగన్‌నే కోరుకుంటున్న ప్రజలు

- గ్రామాల్లో ముమ్మరంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'
- ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుస్తున్న నేతలు

రావులపాలెం: నిరంతరం ప్రజల్లో ఉంటూ సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని రావులపాలెం జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు అన్నారు. గడచిన నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఇంటింటికి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. బుధవారం గోపాలపురం సచివాలయం-3 పరిధిలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని సర్పంచ్ సబ్బితి మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం-3 పరిధిలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గణాంకాలతో, జాతీయ సర్వేల ఆధారంగా వివరించారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నేతలు వివరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి చంద్రబాబు పాలనలో, జగన్ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ, ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. స్థానిక సెంటరులో పల్లె నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, దేవరపల్లి సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, మాజీ ఉప సర్పంచ్ చిర్ల రామచంద్రారెడ్డి, ఎంపీటీసీలు మైగాపుల గంగాభవాని, పల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి, ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్, సెక్రటరీ మహ్మద్ అన్వర్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



గోపాలపురం సచివాలయం-3లో బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

వై ఏపీ నీడ్స్ జగన్..పై అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: టేకిశెట్టిపాలెం పంచాయతీలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ, వార్డు వలంటీర్లకు జేసీఎస్ మండల ఇన్‌ఛార్జి నల్లి మోహన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై అవగాహన కల్పించే విధానాన్ని వివరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు అవసరం అనే బుక్‌లెట్లు కూడా పంపిణీ చేయాలని సూచించారు. పార్టీ నాయకుడు తాడి సహదేవ్ పాల్గొన్నారు.



టేకిశెట్టిపాలెంలో అవగాహన కల్పిస్తున్న మోహన్

బంగారు భవిష్యత్తుకు జగనే ఉండాలి

అంబాజీపేట: ప్రజల బంగారు భవిష్యత్తుకు మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అన్నారు. చిరతపూడిలో చినబాబు ఆధ్వర్యంలో సర్పంచ్ కోట బేబీరాణి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పొన్నమండలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ శైలజ

సంక్షేమం విరాజిల్లుతోంది

రాజోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం విరాజిల్లుతోందని జెడ్పీటీసీ మట్టా శైలజ అన్నారు. బుధవారం పొన్నమండలో సర్పంచ్ కుక్కల బేబీకుమారి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ శైలజ మాట్లాడుతూ గత పాలకులు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, ప్రస్తుతం ఎలాంటి వివక్షకు తావులేకుండా, అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నేత్ర పరీక్షలు చేయించుకున్న వారికి మంజూరైన కళ్లజోళ్లను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మట్టా ఏడుకొండలు, బండారు కాశీ తదితరులు పాల్గొన్నారు.

శంకరాయగూడెం, క్రాప గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్

అయినవిల్లి: క్రాప, శంకరాయగూడెం గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుడిపూడి విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు హాజరుకాగా, శంకరయగూడెం సర్పంచ్ బొక్కా కామేశ్వరరావు, క్రాప సర్పంచ్ బొబ్బిలి సీతాదేవి అధ్యక్షత వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు.

ప్రతి పథకం ఇతర రాష్ట్రాలకు ఆదర్శం



టేకిశెట్టిపాలెం పంచాయతీ వద్ద బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ, ఎంపీడీవో

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెం పంచాయతీ వద్ద బుధవారం ఎంపీడీవో జి.భీమారావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం జరిగింది. ఎంపీపీ వీరా మల్లిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ పెన్షన్ అందజేస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎంపీపీ ఆవిష్కరించారు. గ్రామంలో ప్రముఖులతో కలిసి పార్టీ నేతలు సమావేశం నిర్వహించారు. తొలుత పంచాయతీ వద్ద సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు, వారు పొందిన లబ్ధి తదితర అంశాలతో డిస్‌ప్లే బోర్డును ఎంపీపీ మల్లిబాబు, ఎంపీడీవో భీమారావు ఆవిష్కరించారు. సర్పంచ్ పోతు దేవీదుర్గ, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి నల్లి మోహన్, నాయకులు పోతు తాతయ్యనాయుడు, తాడి సహదేవ్, నల్లి సుధీర్ పాల్గొన్నారు.

జీజీఎంపీ నిధులతో రోడ్లు, డ్రెన్ల నిర్మాణం

ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా ఉన్న రోడ్లు, డ్రెన్ల సమస్యలు గడప గడపకూ మన ప్రభుత్వం (జీజీఎంపీ) కార్యక్రమం ద్వారా పరిష్కారం అవుతున్నాయని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మండలంలోని వాడపాలెం పెదపేటలో జీజీఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించే సీసీ డ్రెన్‌కు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఎంతో చిత్తశుద్ధితో గడప గడపకూ వెళ్లి, వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ, సమస్యలుంటే పరిష్కరిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం విస్మరించిన సీసీ రోడ్లు, డ్రెన్ల నిర్మాణానికి హామీ ఇచ్చారన్నారు. ఇందులో భాగంగానే ఈ సీసీ డ్రెన్ నిర్మాణం అని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో పనులు పూర్తి కాగా, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నేలపూడి భీమరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా సభ్యుడు బండారు కృష్ణమూర్తి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టా బాబ్జి, గ్రామ రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, పంచాయతీ వార్డు సభ్యులు గొల్లపల్లి సూర్యచంద్రరావు, నేలపూడి దుర్గాలక్ష్మి, పార్టీ బూత్ కన్వీనర్ కత్తుల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వాడపాలెంలో సీసీ డ్రెన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గంగాధరరావు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఉప్పిలిలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న నేతలు

ఆత్రేయపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ కప్పల శ్రీధర్, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ బోణం సాయిబాబు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం మండలంలోని అంకంపాలెం గ్రామంలో జరిగింది. సర్పంచ్ ఉబ్రింకల త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. వీరితో పాటు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెన్మెత్స బంగ్రాజు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి శ్యామ్‌సన్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. తొలుత సచివాలయం వద్ద సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో సమావేశమై ఈ కార్యక్రమంపై సమీక్షించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



కరపత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కొత్తపేట: వాడపాలెం గ్రామ దేవత మారెమ్మతల్లి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో భక్తులందరూ భాగస్వాములు కావాలని గ్రామ పెద్దలు, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కోరారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని వాడపాలెం మారెమ్మ తల్లి ఆలయం సుమారు 150 ఏళ్ల క్రితం నిర్మించగా, అది శిథిలావస్థకు చేరింది. నూతన ఆలయం నిర్మాణ విషయాన్ని గ్రామ పెద్దలు, నాయకులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన సానుకూలంగా స్పందించి, తగిన ప్రతిపాదనలు రూపొందించాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. నూతన ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.35 కోట్లు మంజూరు చేసింది. ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించగా, కరపత్రికను బుధవారం ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు బండారు బులితాత, బండారు కృష్ణమూర్తి, మట్టా బాబ్జి, పెదపూడి బాపిరాజు, సింగిరెడ్డి గోవిందుస్వామి, బాపట్ల వెంకటేశ్వర్లు, బండారు లాయరు గంగరాజు, బండారు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా సాయం

రాజోలు: గోదావరిలో మునిగి మరణించిన కలిగితి శ్రీనివాసరావు కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను బుధవారం అందజేశారు. వ్యవసాయ పనుల కోసం ఇటీవల శ్రీనివాసరావు పడవలో గోదావరి నది దాటుతుండగా, నీటిలో పడి చనిపోయాడు. బీమా సాయాన్ని ఎంపీటీసీ కొపనాతి పుష్పలత అందజేశారు. మిగిలిన బీమా సొమ్ము త్వరగా మంజూరయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు కొప్పాడి దుర్గారావు, మండల ప్రధాన కార్యదర్శి మట్టా ఏడుకొండలు, బుంగ శ్రీను, కొపనాతి రాజు తదితరులు పాల్గొన్నారు.

కులగణన ప్రక్రియలో సమగ్ర సమాచార సేకరణ

కొత్తపేట: కుల గణన ప్రక్రియలో సమగ్ర సమాచారాన్ని సేకరించి నివేదించాలని తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు సచివాలయ ఉద్యోగులకు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాయలయంలో కులగణన సర్వేపై సచివాలయాల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆయనతో పాటు తహసీల్దార్ కిషోర్‌బాబు సర్వేపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో కుల గణనను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ సర్వే ప్రక్రియను ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో నిర్వహించాలని సూచించారు. కుటుంబ సభ్యుల ప్రాథమిక సమాచారంలో జిల్లా, మండలం, గ్రామం, ఇంటి చిరునామా, కులం, ఉపకులం, కుటుంబ పెద్ద, కుటుంబ సభ్యులు ఎంత మంది, వారి వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. కుల గణన సమయంలో ప్రజలంతా గ్రామంలో అందుబాటులో ఉండేలా ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. సర్వేపై ముందుగా వలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే కుల గణనను పారదర్శకంగా నిర్వహించి, విజయవంతం చేయాలని సూచించారు. మండల పరిషత్ పరిపాలనాధికారి మేడపాటి హరికృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ డి.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపేటలో కులగణన సర్వేపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ మహేశ్వరరావు

డ్రెయిన్ల పనితీరు మెరుగు పరుస్తాం

ఈఈ వెంకటేశ్వరరావు

మలికిపురం: రాజోలు దీవిలో అధ్వానంగా ఉన్న సాగునీటి డ్రెయిన్ల పనితీరును మెరుగుపరుస్తామని జిల్లా డ్రెయిన్ల ఈఈ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గుడిమెళ్లంకలో వేపచెట్టు మీడియం డ్రెయిన్‌తో పాటు పలు మైనర్ డ్రెయిన్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా ఇక్కడ డ్రెయిన్లలో మురుగునీటి ప్రవాహం సక్రమంగా లేదని ఫిర్యాదులు ఉన్నాయన్నారు. దీనిపై అధ్యయనం చేస్తున్నామన్నారు. వచ్చే దాళ్వా వరి సాగు నాటికి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మురుగునీటి సమస్యల వల్ల సాగు దెబ్బతింటుందని జిల్లా వ్యవసాయ మండలి సభ్యులు గుబ్బల రమేష్ అధికారులకు వివరించారు. రాజోలు డ్రెయిన్స్ డీఈ రాయుడు నాగార్జునరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.



గుడిమెళ్లంకలో వేప చెట్టు డ్రెయిన్ దుస్థితిని ఈఈకి వివరిస్తున్న గుబ్బల రమేష్

మండలాభివృద్ధికి సమష్టి కృషి



ఆలమూరు మండల సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులు

ఆలమూరు: పార్టీలకతీతంగా సభ్యులందరూ మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ ఛైర్మన్ యనమదల నాగేశ్వరరావు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ లక్ష్మణరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి చర్యలను ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ వివరించారు. అలాగే వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్, పశు సంవర్ధక, ఇరిగేషన్, గృహ నిర్మాణ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు తమ ప్రగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

రూ.7.44 లక్షల బడ్జెట్ ఆమోదం

మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.7.44 లక్షల బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. వచ్చే ఏడాది ఆర్థిక సంవత్సరానికి రూ.7,44,900 నికర ఆదాయం వస్తుందని భావించగా, రూ.7,42,636 వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఎంపీటీసీలందరూ బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. తహసీల్దార్ జబీ శెట్టి, ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

విలసలో వంట పాత్రలు పంపిణీ



వంట పాత్రలను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందజేసిన వంట పాత్రలను విలస జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, హెచ్‌ఎం పీవీ రవిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కనకరాజు, కుసుమ విజయకుమార్, వారా లక్ష్మీనరసింహరామ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె నోటీసు

సఖినేటిపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు బుధవారం దశలవారీ ఆందోళనలో భాగంగా మండల స్థాయి అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ మేరకు స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో-1, 2 డి.కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావుకు నోటీసులు అందజేశారు. డిసెంబర్ 11న ఛలో విజయవాడ, 20 నుంచి సమ్మెకు దిగుతున్నట్టు ఉద్యోగులు చెప్పారు.

ప్రధాని ఫొటో ప్రదర్శించాలని వినతి

సఖినేటిపల్లి: ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనంపై ప్రధాని ఫొటో ప్రదర్శించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వై.రామకుమారికి వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర డ్రెనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీగా బాధ్యతల స్వీకరణ

పి.గన్నవరం: మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఇటీవల ఎన్నికైన గనిశెట్టి నాగలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఎంపీడీఓ ఎం.భారతి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం నాగలక్ష్మి దంపతులను దుశ్శాలువాతో సత్కరించారు.

డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలి

అంబాజీపేట: రబీకి సంబంధించి డిసెంబర్ నెలాఖరు నాటికి రైతులు వరినాట్లు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.బోసుబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు అధ్యక్షతన వీఏఏ, వీహెచ్‌ఏలకు ప్రత్యామ్నాయ పంటలు, మందస్తు రబీ వరిసాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ డిసెంబర్ నెలాఖరుకు వరినాట్లు పూర్తయితే, మార్చి నెలాఖరుకు కోతకు వస్తుందన్నారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.భవాని, మండల వ్యవసాయాధికారులు సీహెచ్‌డీ విజయకుమార్, కల్యాణ్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి లక్ష బిల్వార్చన

మామిడికుదురు: ప్రసిద్ధిచెందిన మామిడికుదురులోని శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు చంద్రమౌళి శంకరం ఆధ్వర్యంలో ఈదరాడకు చెందిన బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో ఈలి శ్రీనివాస్, మంగతాయారు దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొన్నారు. విఘ్నేశ్వరపూజ, రామలింగేశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. రామలింగేశ్వరునికి లక్ష మారేడు దళాలతో అర్చన చేశారు.

రూ.15 కోట్లతో మంగండపాలెంలో అభివృద్ధి, సంక్షేమం



ముంగండపాలెంలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నాయకులు

పి.గన్నవరం: ముంగండపాలెం గ్రామంలో ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం సుమారు రూ.15 కోట్లు ఖర్చు చేసిందని నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. ముంగండపాలెంలో సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి కార్యక్రమాల బోర్డును, పార్టీ పతాకాన్ని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, కుడుపూడి నాగార్జునరావు, యాండ్ర నాగేశ్వరరావు, కొప్పిశెట్టి ప్రసాద్, నూకపెయ్యి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



చిన్న బూరయ్య (ఫైల్‌ఫొటో)

ఆత్రేయపురం: ర్యాలి గ్రామానికి చెందిన వనచర్ల చిన్న బూరయ్య వారం క్రితం కాలువలోకి స్నానానికి వెళ్లి అదృశ్యమైనట్టు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ మేరకు చిన్న బూరయ్య భార్య జవ్వాలమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు. గోదావరి కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మెర్లపాలెం విద్యార్థిని



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అనూష

ఆత్రేయపురం: మెర్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థిని చింతల అనూష రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం సీహెచ్ శ్రీహరి, పీఈటీ ఎస్.శ్రీకాంత్ తెలిపారు. ఇటీవల కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు చెప్పారు. విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీడీఓ నాతిబుజ్జి, ఎంఈఓ వరప్రసాద్, సర్పంచ్ మెర్లరాము, మాజీ సర్పంచ్ జంపన సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు త్రిమూర్తులు, వీర్రాజు ఆమెను అభినందించారు.

ఎంపీపీకి ఎంపీ పరామర్శ



మాచవరంలో ఎంపీపీ వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న ఎంపీ అనురాధ

అంబాజీపేట: డెంగీకి వైద్యం చేయించుకుని మాచవరంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావును అమలాపురం ఎంపీ చింతా అనురాధ బుధవారం పరామర్శించారు. అధైర్య పడవద్దని ఎంపీపీకి మనోధైర్యం కల్పించారు. ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. ఎంపీ వెంట నాయకులు మైలా ఆనందరావు, అడపా శ్రీనివాసరావు, జల్లి రామకృష్ణ, దొమ్మేటి రాధాకృష్ణ, మంగ, గాడా గణేష్ తదితరులు ఉన్నారు.

కళలతో సమాజంలో మార్పు

అంబాజీపేట: సమాజంలో మార్పు కోసం కళా రంగాన్ని, కళాకారులను ప్రోత్సహించాలని తాడేపల్లి గూడెం బీవీఆర్ కళాక్షేత్రం బుద్దాల వెంకటరామారావు అన్నారు. అరిగెల బలరామమూర్తి సాహితీ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కవితా పోటీల్లో విజేతలకు అంబాజీపేట కొర్లపాటివారిపాలెం సామాజిక భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులను బుధవారం అందించారు. కళాపీఠం నిర్వాహకులు అరిగెల బలరామమూర్తి అధ్యక్షత వహించారు. ఎస్.సంసోన్, చొప్పళ్ల రామారావుకు బహుమతులను అందించారు. అలాగే పచ్చిగోళ్ల సుధకు పోత్సాహక బహుమతిని అందించారు.